నమస్తే తెలంగాణ
సూర్యాపేట
3 | నల్లగొండ, గురువారం 15 ఫిబ్రవరి 2024 | SURYAPET

## పట్టభద్రుల ఓటు నమోదుకు మరో చాన్స్

**అర్హులు దరఖాస్తు చేసుకోవాలి : అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు**

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఓటరు నమోదుకు మరో అవకాశం ఉన్నదని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), డిప్యూటీ డీఈఓ భాస్కర్‌రావు తెలిపారు. ఓటు హక్కు నమోదు కోసం ఫారం–18లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 24న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 6 తర్వాత, 14 వరకు సమర్పించిన దరఖాస్తులన్నీ క్లెయిమ్‌ల వ్యవధిలో పరిష్కరించనున్నట్లు వివరించారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల గడువు మార్చి 14తో ముగుస్తుందని తెలిపారు. ప్రస్తుత నమోదుకు అర్హత తేదీ నవంబర్ ఒకటి అని తెలిపారు. వ్యక్తిగతంగా గానీ, పోస్ట్ ద్వారా గానీ పెద్ద మొత్తంలో సమర్పించిన దరఖాస్తులను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి పరిగణనలోకి తీసుకోరని పేర్కొన్నారు. ఆయా సంస్థల ప్రతినిధులు తమ అర్హత గల ఉద్యోగులందరి దరఖాస్తులను కలిపి పంపించవచ్చని వివరించారు. ఒక వ్యక్తి తన కుటుంబంలోని అర్హతగల సభ్యుల ఫారాలను కూడా సమర్పించవచ్చని తెలిపారు. ఏదైనా సందేహం ఉంటే ఈఆర్వో లేదా ఏఈఆర్వోను సంప్రదించాలని సూచించారు.



స్వామివారి ఊరేగింపు ప్రారంభంలో ఎమ్మెల్యే వీరేశం, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

## శోభాయమానంగా నగరోత్సవం

**రామలింగేశ్వరస్వామి ఊరేగింపును ప్రారంభించిన ఎమ్మెల్యే వీరేశం**

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 14 : నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని స్వామివారి నగరోత్సవం నల్లగొండ పుర వీధుల గుండా బుధవారం శోభాయమానంగా జరిగింది. జిల్లా కేంద్రంలోని రామాలయం ఆవరణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో స్వామి, అమ్మవార్లను ఆశీనులను చేసి పూజలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం నగరోత్సవాన్ని ప్రారంభించారు. పట్టణంలోని రామగిరి, క్లాక్‌టవర్, ఎన్జీ కళాశాల సర్కిల్, వీటీ కాలనీ మీదుగా చెర్వుగట్టు వరకు స్వామి, అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించారు. నగరోత్సవంలో భాగంగా కోలాటం, భజన బృందాలతోపాటు విద్యుత్ కాంతుల నడుమ, దేవతామూర్తుల వేషధారణలో భక్తులతో కోలాహలంగా సాగింది. భక్తులు అడుగడుగునా నగరోత్సవానికి నీరాజనం పలికారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, కౌన్సిలర్లు ప్రదీప్‌నాయక్, శ్రీనివాస్, ఈఓలు నవీన్, నాగిరెడ్డి, సత్యనారాయణ, చెర్వుగట్టు ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతనోత్తేజం





## జోష్ నింపిన కేసీఆర్ సభ

**కాంగ్రెస్ సర్కార్‌పై తనదైన శైలిలో విమర్శనాస్త్రాలు**

**కేసీఆర్ పంచ్ డైలాగ్‌లకు కేడర్ ఫిదా**

**గులాబీ శ్రేణుల్లో రెట్టింపైన ఆత్మవిశ్వాసం**

'కృష్ణా జలాల్లో హక్కుల కోసం నల్లగొండ జిల్లా ప్రజలు ఎప్పటికప్పుడు పోరాటానికి సిద్ధంగా ఉండాలి. యాక్షన్ కార్యక్రమాలకు ఎప్పుడు పిలుపునిచ్చినా.. ప్రభుత్వ దమన నీతిని ఎండగట్టాలని కోరినా.. మీరు సిద్ధంగా ఉండాలి. కాంగ్రెస్ దుర్మార్గాలపై కొట్లడుదాం.. పోరాడుదాం.. మన హక్కుల కోసం నిలబడుదాం.' అంటూ సాగిన బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రసంగం ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ప్రతికూల ఫలితాల నుంచి క్యాడర్ తేరుకుని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరుకు సమాయత్తం చేసేలా చలో నల్లగొండ సభ సాగింది. అధినేత కేసీఆర్ నోట ఉద్యమ కాలం నాటి పంచ్ డైలాగ్‌లు బుల్లెట్లలా దూసుకు వస్తుంటే పార్టీ నేతలు, కార్యకర్తలు కేరింతలు కొట్టారు. రానున్న కాలంలో సర్కార్‌పై కొట్లాడుదామా.. పోరాటం చేద్దామా? అని ప్రశ్నిస్తే చేద్దామంటూ బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజల నుంచి మద్దతు లభించింది. డబుల్ స్పీడ్‌తో అధికారంలోకి వస్తాం.. అప్పుడు అన్నీ చేసుకుందామంటూ కేసీఆర్ చెప్పిన మాటలు తమ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసిందన్న అభిప్రాయాన్ని పార్టీ శ్రేణులు వ్యక్త పరిచాయి.

– నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ)

కేఆర్‌ఎంబీకి కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతపై గర్జిస్తూ మంగళవారం జరిగిన చలో నల్లగొండ బహిరంగ సభ బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని విధంగా వచ్చిన ప్రతికూల ఫలితాలను కేడర్‌లో కొంత నిస్తేజాన్ని కలిగించింది. మరోవైపు కొత్తగా గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, వాళ్ల అనుచరులు బీఆర్‌ఎస్ పార్టీ వాళ్లకు ఇబ్బందులు సృష్టించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. అదిరింపులు బెదిరింపులతో పార్టీ శ్రేణులను లొంగదీసుకుని బలహీనపర్చాలన్న కుయుక్తులకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే వేధింపులకు గురి చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో కృష్ణా నదీ జలాల్లో హక్కుల కోసం కేసీఆర్ పోరుబాటకు పిలుపునివ్వడం, అందుకు నల్లగొండను వేదికగా చేసుకోవడంతో ఉమ్మడి జిల్లా పార్టీకి కలిసొచ్చే అంశంగా మారింది. దీంతో ఈ బహిరంగ సభ ద్వారా ప్రజలతోపాటు పార్టీ క్యాడర్ యావత్తు కదలివచ్చేలా ప్రణాళికతో వ్యవహరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతలంతా రంగంలోకి దిగి సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా చర్యలు చేపట్టారు. పార్టీ శ్రేణులతో ముందుగా సన్నాహక సమావేశాలు నిర్వహించి సమయాత్తం చేయడంతో సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనుకున్న దాని కంటే ఎక్కువగా జనం, పార్టీ శ్రేణులు తరలిరావడంతో నాయకత్వంలోనూ మంచి ఊపు కనిపించింది. తరలివచ్చిన వారిలోనూ భారీ ఎత్తున యువత ఉండడం, వారు చేసిన సందడితో సభ మరింత ఉత్సాహంగా సాగింది.

### యావత్ పార్టీ భాగస్వామ్యం

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పార్టీలోని అన్ని స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు, నేతలు, క్యాడర్ ఈ సభకు తరలివచ్చారు. క్రియాశీలక సభ్యులంతా సభలో ఉత్సాహంగా పాల్గొన్నారు. చాలా వరకు తమ సొంత వాహనాల్లో సభకు చేరుకున్నారు. దీంతో సభ ఆద్యంతం ఉత్తేజభరితంగా సాగింది. వచ్చిన వారందరూ సభా ప్రాంగణానికి చేరుకుని అభిమాన నేత కేసీఆర్ రాక కోసం ఎదురుచూశారు. నెత్తిన ఎండ దంచుతున్నా వేచి చూశారు. కేసీఆర్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కనిపించగానే అందరూ ఒక్కసారిగా లేచి అభివాదం చేస్తూ తమ అభిమానాన్ని చాటారు. కేసీఆర్ చేతి కర్ర సహాయంతో సభా వేదిక మీదకు వస్తుంటే ఆయన్ను చూసేందుకు అమితాసక్తిని చూపించారు. సీఎం సీఎం అంటూ యువత చేసిన నినాదాలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. దీంతో నల్లగొండకు తరలివచ్చిన ప్రతి ఒక్కరిలో కేసీఆర్ సభ స్ఫూర్తి నింపిందనడంలో సందేహం లేదు.

### దిశానిర్దేశం చేసేలా..

ఇక కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలను, సీఎం, ఇతర మంత్రులు చేస్తున్న అడ్డగోలు ఆరోపణలను కేసీఆర్ సుతిమెత్తగా తిప్పికొడుతూ చేసిన ప్రసంగం హైలెట్‌గా నిలిచింది. దీంతోపాటు ప్రజలు అధికారం ఇచ్చారు.. ఐదేండ్లు పాలన చేయుండ్రి.. మంచి పనులు చేయుండ్రి అని హితవు పలుకడం ఆలోచింపజేసింది. తన కట్టె కాలే వరకు తెలంగాణకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోను.. ఇది లేచిన తెలంగాణ.. టైగర్ తెలంగాణ వంటి మాటలు క్యాడర్‌లో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేశాయి. కొట్లాడుదాం, నిద్ర కూడా పోనివ్వం.. గర్జిద్దాం, నిలదీద్దాం.. ఎక్కడికక్కడ నిలబెడదాం అని పిలుపునిచ్చారు. 'అందరం కొట్లాడుదాం.. పోరాటం చేద్దామా.. అంటూ దిశానిర్దేశం చేసేలా ముగిసిన కేసీఆర్ ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. పార్టీ శ్రేణులన్నీ రానున్న కాలంలో ఏ పోరాటానికి పిలుపునిచ్చినా సిద్ధమేననేలా కేసీఆర్ సభ కొనసాగడం విశేషం. దీంతోపాటు వచ్చే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలకు సైతం పార్టీ క్యాడర్ సమాయత్తం అయ్యేలా కేసీఆర్ ప్రసంగం కొనసాగింది.



మంగళవారం నాటి చలో నల్లగొండ సభకు హాజరైన జన సందోహంలో ఒక భాగం



మిర్యాలగూడ రూరల్ : అవంతీపురంలో శ్రీనివాసుడికి నిర్వహిస్తున్న శాంతి కల్యాణం

## కన్నుల పండువగా శ్రీనివాసుడి శాంతి కల్యాణం

- సరస్వతీ మందిరంలో సామూహిక అక్షరాభ్యాసం
- కల్యాణానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు దంపతులు

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 14 : మండలంలోని అవంతీపురం కొండపై శ్రీదేవి, భూదేవీ సమేతంగా వెలిసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి శాంతి కళ్యాణం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవీలను పెళ్లి కూతురుగా, వేంకటేశ్వర స్వామిని పెండ్లి కొడుకుగా ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలతో అలంకరించారు. స్వామి, అమ్మవార్లను పల్లకీలో భక్తులు ప్రత్యేకంగా అలంకరించిన పెండ్లి మంటపానికి తరలించారు. పెండ్లి పీటలపై కూర్చోబెట్టి అర్చకులు రామానుజాచార్యులు, గుంటూరు రాధాకృష్ణమాచార్యులు పెళ్లి తంతును ప్రారంభించారు. దేవాలయ కమిటీ చైర్మన్ శరత్‌బాబు పట్టు వస్త్రాలు, తలంబ్రాల బియ్యం సమర్పించారు. స్వామివారి సన్నిధిలో సుమారు 80మంది దంపతులు కల్యాణ పీటల మీద కూర్చొని కల్యాణంలో పాల్గొన్నారు. స్వామివారి కల్యాణోత్సవానికి మిర్యాలగూడ మున్సిపాలిటీ, గూడూరు, అవంతీపురం, బాదలాపురం, సుబ్బారెడ్డి గూడెం, ఆలగడప, రాయినిపాలెం, కొత్తగూడెం, కిష్టాపురం గ్రామాల నుంచి, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల, చిల్లేపల్లి, గుడుగుంట్లపాలెం, పాలకవీడు గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు దంపతులు వేంకటేశ్వరస్వామి కల్యాణానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణానికి హాజరైన వారిలో చెన్నయ్య , సీఎస్పీ వెంకటగిరి, ఎంపీపీ నూకతల సరళ, జడ్పీటీసీ తిప్పన విజయ సింహారెడ్డి నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సైదయ్య, ఎంపీటీసీ సుజాత పాల్గొన్నారు.

**సామూహిక అక్షరాభ్యాసం**

వసంత పంచమిన సరస్వతీదేవి పుట్టిన రోజు కావడంతో అవంతీపురం సరస్వతీదేవి ఆలయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతోపాటు తమ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. సుమారు 150 మంది పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

## ఇంటికే మేడారం ప్రసాదం

- ఆర్టీసీ కార్గో ద్వారా అందజేత
- నేటి నుంచి ఈ నెల 25 వరకు బుకింగ్

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 24 : మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లలేని భక్తులకు గతంలో మాదిరిగానే ఈ సారి కూడా అమ్మవారి ప్రసాదాన్ని ఇంటికే అందించేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దేవస్థానం నుంచి అమ్మవారి ప్రసాదంతోపాటు పసుపు, కుంకుమ ఆర్టీసీ కార్గో ద్వారా భక్తులకు అందజేయనుంది. మేడారం జాతర ఈ నెల 21నుంచి 24 వరకు జరుగనుండగా.. గురువారం నుంచి ఈ నెల 25 వరకు అన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అమ్మవారి ప్రసాదాన్ని బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని ఆర్టీసీ కల్పించింది.

**రూ.299 చెల్లించి బుకింగ్ చేసుకోవాలి**

జాతరకు వెళ్లలేని భక్తులు సమీపంలోని టీఎస్ ఆర్టీసీ కార్గో కౌంటర్లలో మేడారం జాతర ప్రసాదాన్ని బుకింగ్ చేసుకోవచ్చు. బుకింగ్ చేసుకునే భక్తులకు ప్రసాదంతోపాటు అమ్మవార్ల పసుపు, కుంకుమను అందజేయనున్నారు. బుక్ చేసుకున్న భక్తులకు మేడారం జాతర అనంతరం నేరుగా వారి ఇంటికే ప్రసాదాన్ని అందజేయనున్నారు. జిల్లాలోని అన్ని కార్గో సెంటర్‌లో ఈ సేవ అందుబాటులో ఉంటుందని ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీదేవి తెలిపారు.

## క్రీడాకారులు లక్ష్యంతో ముందుకు సాగాలి

**హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లయ్య**



నకిరేకల్ : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నోడల్ అధికారి వీరారెడ్డి, పక్కన పుల్లయ్య

నకిరేకల్, ఫిబ్రవరి 14 : క్రీడాకారులు మంచి లక్ష్యంతో ముందుకు సాగాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య సూచించారు. నకిరేకల్ మండలంలోని మంగళపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం సీనియర్ పురుషులు, మహిళల హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక జరిగింది. మండల నోడల్ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కర్ర వీరారెడ్డి సమక్షంలో పరిచయ కార్యక్రమం, అనంతరం జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ ఉమ్మడి జల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 17 నుంచి 19 వరకు కరీంనగర్ జిల్లాలో జరిగే 52వ సీనియర్ పురుషులు, మహిళల హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎండీ ఉస్మాన్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, అనిల్‌రెడ్డి, సాయికుమార్ పాల్గొన్నారు.

# చేనేత మిత్రకు మంగళమేనా..?

## నేతన్నల పథకాన్ని అటకెక్కించిన కాంగ్రెస్ ప్రభుత్వం

- బీఆర్‌ఎస్ హయాంలో నెలకు రూ.3వేల ఆర్థిక సాయం
- కొత్త సర్కార్ వచ్చాక ఒక్క పైసా విడుదల చేయలే..
- నేతన్నలకు రెండు నెలలుగా అందని సాయం
- ఆశగా ఎదురుచూస్తున్న 10,600 మంది చేనేత కార్మికులు

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ఒక్కొక్కటిగా పాతర వేస్తున్నది. ఇటీవల వరకు సమర్థవంతంగా అమలైన కార్యక్రమాలను ఆపేస్తున్నది. చేనేత కార్మికుల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన చేనేత మిత్ర పథకానికి మంగళం పాడే ప్రయత్నాలు చేస్తున్నది. నేతన్నలకు నెలకు రూ.3వేల ఆర్థిక సాయాన్ని అందించకుండా అటకెక్కిస్తున్నది. దీనిపై చేనేత కార్మికులు, సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో నేతన్నల బతుకులు అస్తవ్యస్తంగా ఉండేవి. సర్కారు తోడ్పాటు లేక వారి కుటుంబ పరిస్థితులు దుర్భరంగా మారి జీవితం వెల్లదీయడమే కష్టంగా ఉండేది. పనిలేక, ఉపాధి కరువై అప్పుల పాలయ్యేవారు. తెచ్చిన అప్పులు, మిత్తీలు కట్టలేక ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు ఎన్నో ఉన్నాయి కానీ.. స్వరాష్ట్రంలో నేతన్నల బతుకులు మారాయి. నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకొచ్చింది. నేతన్నలకు పొదుపు పథకం, పింఛన్లు, రాయితీలు, పావలా వడ్డీ రుణ మాఫీ, ఆధునిక ఆసు యంత్రాల పథకం, నేతన్నకు బీమా పథకాలను అమలు చేసింది.

**గతంలో రూ.3వేల ఆర్థిక సాయం**

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నేత కార్మికుల కోసం చేనేత మిత్ర పథకాన్ని అమలు చేసింది. ఈ పథకం కింద నూలు, రసాయనాలు, ముడి సరుకులకు సబ్సిడీ ఇచ్చేది. నూలు, సిల్క్, ఉన్ని, డై, రసాయనాల కొనుగోలుపై 40శాతం సబ్సిడీ కల్పించేది. దీంతో జిల్లాలో రూ.38 కోట్ల సబ్సిడీ చేనేత కార్మికులకు అందింది. అయితే.. సబ్సిడీ పొందడం నేతన్నలకు ఇబ్బందిగా మారింది. జీఎస్టీ బిల్లులు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు తదితర విధానంతో సబ్సిడీ పొందలేకపోతున్నారని అప్పటి సర్కార్ గుర్తించింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని పథకంలో మార్పు చేసింది. అర్హులైన నేతన్నలకు రూ.3వేల సాయం చేయాలని నిర్ణయించింది.



మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు

**నాడు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ**

గతేడాది సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి మార్పు చేసిన పథకం అమల్లోకి వచ్చింది. ఒక్కో కుటుంబానికి రూ.3వేలు అందాయి. అందులో రూ.2వేలు నేత కార్మికుడికి, వెయ్యి అనుబంధ కార్మికుడి (భార్య లేదా కుటుంబ సభ్యులు) ఖాతాల్లో జమ అయ్యాయి. ఒక వేళ అనుబంధ కార్మికులు ఇద్దరు ఉంటే ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జమ చేశారు.

**కాంగ్రెస్ సర్కార్ ఒక్క పైసా ఇయ్యలే..**

నేత కార్మికులను ఆర్థికంగా ఆదుకునేందుకు కేసీఆర్ సర్కారు తీసుకొచ్చిన పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు అయినా ఇప్పటికీ ఒక్క పైసా విడుదల చేయలేదు. జిల్లాలో మొత్తం 10,600 మంది అర్హులు ఉండగా.. అందరూ ఆర్థిక సాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. అసలు ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగిస్తుందా.. లేదా? ఇతర పథకాల లెక్క మంగళం పడుతుందా.. అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### చేనేతను విస్మరిస్తున్న పాలకులు



చేనేత రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కార్మికుల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు బడ్జెట్ కేటాయించకపోవడంతో ఆ పథకాలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. గత ఆగస్టు, నవంబర్ నెలల్లో జియో ట్యాగింగ్ కలిగిన నేతన్నలకు రూ.2వేలు, ఇద్దరు అనుబంధ కార్మికులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున మొత్తం మూడు వేల రూపాయలు నేరుగా బ్యాంక్ ఖాతాలో జమ చేసేవారు. ఇప్పుడు వాటి గురించి అడిగేవారు కరువయ్యారు. ఈ విషయమై నాయకుల దృష్టికి తీసుకెళ్లాం. చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– చింతకింది రమేశ్, చేనేత జన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు

### నేతన్న పథకం ఊసే లేదు



కేసీఆర్ పాలనలో చేనేత మిత్ర పథకం కింద నేతన్నకు రెండు వేల రూపాయలు ఖాతాలో వేసేవాళ్లు. ఆ గవర్నమెంట్ పోయినంక ఆ పథకం ఊసే లేదు. కార్మికులను ఆదుకునేది పోయి ఉన్న పథకాలే బంద్ చేస్తుండ్రు. నేసిన వస్త్రాలు కొనుగోలు చేయట్లేదు. పని కల్పించరు. గతంలో కార్మికుల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో నెలకు సుమారు 6వేల రూపాయలు వచ్చేటివి. ఈ గవర్నమెంట్ వచ్చాక ఏదీ లేదు.

– ఈపూరి బాలయ్య, చేనేత కార్మికుడు, భూదాన్ పోచంపల్లి